


# పసికూనలు- ప్రచారవీణలు

అంబల్ల జనార్ధన్

"నువ్వేన్నయినా చెప్పు శైలేశ్, నేను సమర్థించను"

"ఏం ఇందులో తప్పేముంది?"

"తప్పా, తప్పున్నరా? కాలేజీలో మానవత్వంపై ఎన్నో లెక్చర్లు దంచిన నువ్వు చేయాల్సిన పనేనా ఇది?"

"అసలు మానవత్వం అంటే ఏమిటో తెలుసా నీకు? తెలిస్తే ఇలా అనవు."

"నీ నుండే తెలుసుకోవాలి చెప్పు."

"బిచ్చమెత్తుకు తిరిగే పిల్లలకు ఉపాధి కల్పించటం మానవత్వం కాదా? అసాంఘిక శక్తుల పాలిటబడ్డ పసికూనలను శ్రామికశక్తిగా మలచ ప్రయత్నిస్తున్నందుకు మెచ్చుకోవాల్సింది పోయి, నిందిస్తున్నావేంటి సురేందర్?"

"ముక్కు పచ్చలారని పిల్లలను, మండుటెండలో, మీ కంపెనీ బ్యానర్ పట్టుకు నుంచో బెట్టడం, అమానుషం కాదూ? కాళ్లు పీకుతున్నా గంటలకు గంటలు నుంచోడంలో ఉన్న బాధ, ఏ.సి. రూముల్లో ఉంటూ, ఏ.సి. కారులో తిరిగే నీకేం తెలుసు?"

"శ్రమ లేకుండా ఏదీ సాధ్యం కాదు. భుక్తికై ఆ మాత్రం కష్టపడకపోతే ఎలా? ఇక నా ఏ.సి. జీవితశైలి గురించి నీవు దెప్పనవసరం లేదు. కడుపులో చల్ల కదలకుండా పీ.జీ. వరకూ చదువు వెలగబెట్టిన నీకంటే, కష్టమంటే ఏమిటో నాకే బాగా తెలుసు. అనుక్షణం అడుదొడుకుల నెదుర్కొని, ఫీజులకు, పుస్తకాలకు, ఇతర ఖర్చులకు, పేపర్‌బాయ్‌గా, కౌంటర్ సేల్స్‌మన్‌గా, పార్ట్‌టైం టైపిస్ట్‌గా, ట్యూషన్ల మాష్టారుగా ఎన్నో రూపాలెత్తి ఎం.బి.ఏ. పట్టా సాధించాను. శ్రమసౌందర్యం గురించి నీలాంటి వారినుండి లెక్చరు వినాల్సిన గతి నాకు పట్టలేదు."

"అదేంటి శైలేశ్! అంత ఆవేశపడతావ్? కాస్త నిదానంగా ఆలోచిస్తే నా పాయింట్ నీకర్థమౌతుంది. తక్కువ ఖర్చుతో ఎక్కువ ప్రచారాన్ని సాధించాలనే నీ ఎం.బి.ఏ. బుర్రకు హాట్సాఫ్. కాని ఆ పసికూనల వైపు నుండి కూడా చూడు. నా పాయింట్ అర్థమౌతోంది. నా ఆవేదన తెలుస్తుంది."

"సురేందర్, ఆ పిల్లలపట్ల నీ ఆవేదన నిజమే అయితే, వారికొరకు నీవు చేసిందేమిటి? వారి మొహాన ఓ రూపాయి వేసి చేతులు దులుపుకోవడం కాకుండా, వారికో జీవితాన్ని ఇవ్వడానికి, నీవుగానీ, నీ భావజాలం పంచుకునే మిత్రులుగానీ, నిర్మాణాత్మక పనులేమైనా చేపట్టారా?"

'తేనెతుట్టెను కదిలించానురా దేవుడా' అనుకున్నాడు సురేందర్. చర్చను దారి మళ్ళించాలని "ఇలా వాదులాడుకుంటు పోతే తెల్లార్తుంది గానీ, హరిత, పిల్లల విషయాలు చెప్పు."

వారి మాటలు కుటుంబ సంగతుల వైపుకు మళ్ళాయి.

సురేందర్, శైలేశ్ బాల్యస్నేహితులు. ఇద్దరూ ఉస్మానియా యూనివర్సిటీలోనే చదివారు. కాలేజీ రోజుల్నుంచీ వారికి అభిప్రాయభేదాలున్నాయి. అయినా విడదీయలేని స్నేహం, అదే చిత్రం! బ్రతుకు బాట ఒకరిని బెంగుళూరు చేరిస్తే, ఇంకొకరిని ముంబాయి వైపు నెట్టింది.

సురేందర్ ముంబాయిలో ఓ ప్రైవేటు సంస్థలో ఆఫీసరు, శైలేశ్ బెంగుళూరులోని ఓ ఎలక్ట్రానిక్ ఉత్పత్తుల సంస్థలో వైస్ ప్రెసిడెంట్ (మార్కెటింగ్ అండ్ ఎడ్మినిస్ట్రేషన్).

ముంబాయిలో తమ క్రొత్తప్రాడక్ట్ లాంచింగ్‌కి వచ్చాడు శైలేశ్. ప్రొద్దున్నుంచి కంపెనీ అధికారులతో, డీలర్లతో మీటింగులు, అడ్వర్టైజింగ్ ఏజెన్సీకి బ్రీఫింగ్, ప్రెస్ కాన్ఫరెన్స్... బిజీ, బిజీ.

అంత హడావుడిలోనూ మరవకుండా, తన చిన్ననాటి నేస్తానికి ఓ సాయంత్రం కేటాయించాడు. సురేందర్, తమ ఇంటికి రమ్మని ఎంత బలవంతం చేసినా, సమయాభావం వల్ల అతన్నే తన హోటల్‌కి, డిన్నర్‌కి పిలిచాడు.

ఆ సందర్భంలో వారి సంభాషణ వేడిగా మొదలైనా, ఒకరొకరి కుటుంబ భోగట్టాలతో ఆప్యాయంగా ముగిసింది. రాత్రి పదిగంటలు కావడంతో సురేందర్ అయిష్టంగానే శివార్లలోని తమ ఫ్లాటుకు బయలుదేరాడు.

సురేందర్ వెళ్ళిపోయినా, అతను లేవనెత్తిన అంశాలు శైలేశ్‌ను వీడలేదు. ఆరోజు సంఘటనలను మననం చేసుకుంటే...

ముంబాయి అంతటా తమ క్రొత్త ప్రాడక్టు బ్యానర్లు! ప్రతి వందమీటర్లకు ఇద్దరు పిల్లలు తమ బ్యానర్ పట్టుకుని నుంచున్నారు. ఈ వినూత్నవిధానం వల్ల అవి అందర్నీ ఆకర్షించాయి. టీ.వీ.ద్వారా, హోర్డింగ్ ద్వారా అంత ప్రచారం లభించేది కాదు. ఖర్చు మాత్రం ఎన్నో రెట్లు ఎక్కువయ్యేది. ఫలితంగా!

డీలర్లనుండి ప్రోత్సాహకరమైన స్పందన!

లక్షల్లో ఆర్డర్లు!

ప్రొఫెషన్‌లో సక్సెస్ కాని....

సురేందర్ విమర్శ!

తను ఏదో గొప్పపని చేసినట్టు. సురేందర్‌తో పోజుకొట్టాడుకాని నిజంగా ఆ పిల్లల పట్ల శ్రద్ధతోనైనా తను ఆ ప్రచార మాధ్యమం ఎన్నుకుంది? కాదంది అంతరాత్మ.

కేవలం ఖర్చు తగ్గించుకోవడానికే ఆ నిర్ణయం తీసుకున్నాను. అయినా తాము పెట్టిన ఖర్చులో ఆ పిల్లలకు ముట్టిందెంత? పదిశాతం కూడా కాదేమో? అంటే ఏమిటి? తొంభై శాతం పిల్లలను సరఫరా చేసిన వాళ్ళూ, యాడ్ ఏజెన్సీవాళ్ళూ కొట్టేసినట్టేగా?

అది దోపిడి కాదూ? దానికి తను దోహదం చేయలేదూ?

శైలేశ్ మనసంతా అల్లకల్లోలం అయింది. కలత నిద్రతోనే తెల్లారింది. మార్నింగ్ ఫ్లైట్‌లో బెంగుళూరు వెళ్ళిపోయాడు.

ఆఫీసులో అందరి అభినందన!

కాస్ట్ ఎఫెక్టివ్ మీడియా! మాక్సిమమ్ యాడ్ మైలేజ్! లాంచింగ్‌తోనే లక్షల్లో ఆర్డర్స్!

యం.డి. చాలా సంతోషపడ్డాడు. శైలేశ్ కేబిన్‌కి వచ్చి మరీ కంగ్రాట్స్ చెప్పాడు.

శైలేశ్ అందరి విషెస్ అందుకున్నాడు. మనసు మాత్రం తొలుస్తోంది. ముంబాయి ఏర్‌పోర్ట్ నుంచి నారీమన్ పాయింట్ దాకా బ్యానర్లు పట్టుకుని నిలబడ్డ పిల్లలే కళ్ళలో మెదులుతున్నారు.

అలసటతో కూడిన వారి వదనాలు తనను నిలదీస్తున్నట్లు ఫీలింగ్.

కనీసం ఏడుగంటల వరకైనా ఆఫీసులో ఉండే తను, ఆరోజు ఆరు గంటలకే ఇంటికి చేరుకున్నాడు.

"ఈ రోజు సూర్యుడు తూర్పున అస్తమించినట్టున్నాడు. ఆరుగంటలకే కారు ఇంట్లో ఉదయించింది?"


జవాబియ్యలేదు శైలేశ్. మౌనంగా తనరూంలోకి వెళ్ళిపోయాడు.

"ఏమైందండీ, అదోలా ఉన్నారు? శ్రీమతి ఆందోళన."

"మంచి కాఫీ పెట్టు హరితా, ఈలోగా నేను ఫ్రెష్ అవుతాను."

"ఇప్పుడు చెప్పండి, ఏమిటీ సంగతి?" కాఫీ బిస్కట్లు ఇస్తూ అడిగింది హరిత.

ఒక గుక్క కాఫీ త్రాగి, బిస్కట్టు నోట్లో వేసుకుని మొదలెట్టాడు శైలేశ్. కొత్త ప్రాడక్టు, లాంచింగ్ కంపెనీ పనులు, తన ముంబాయి విజిట్, ప్రచార మాధ్యమంగా పిల్లలను ఉపయోగించడం, రాత్రి సురేందర్‌తో వాదన, అన్నీ చెప్పాడు.



"నేను గిల్టీగా ఫీలౌతున్నాను హరితా!"

"అంత పెద్ద పోస్టు చేస్తూ, ఇంత సెన్సిటివ్‌గా ఉంటే ఎలాగండీ? మానేజ్‌మెంట్ డిక్షనరీలో దయాదాక్షిణ్యాలకు చోటు ఉండదనుకుంటాను."

"నా మాటలు నాకు అప్పగించినందుకు సంతోషించాను. కాని, నేనన్న సందర్భం వేరు. ఈ పరిస్థితి వేరు. నా తప్పు సరిదిద్దుకోవడానికి ఏంచేస్తే బావుంటుందా అని నా తపన."

"మీ పనుల్లో తలదూరుస్తున్నాననుకోకపోతే నేనొకటి చెప్పనా?"

"చెప్పు"

"ఈ పోటీ ప్రపంచంలో ప్రచారానికున్న విలువ కాదనలేము. తక్కువ ఖర్చుతో ఎక్కువ లబ్ధి పొందాలనుకోవడం నేరంకాదు. అలా అని దోపిడీని సమర్థించను నేను. అది ఎలా ఆపగలరో ఆలోచించండి. ఏదో ఒక ఐడియా రాకపోదు."

"నా బుర్ర పనిచేయనని మారాం చేస్తేనే కదా, నీతో మొరపెట్టుకుంది. నీవూ ఎం.బి.యే కదా కాస్త నాకు సహాయం చేయరాదూ."

"మీ కంపెనీ జీతం మీకు ఇస్తుంది. నాకు కాదు. నా నుండి ఐడియా తీసుకుని క్రెడిట్ అంతా కొట్టేద్దామనే?"

"వేళాకోళం కాదు హరితా, సీరియస్‌గా అంటున్నాను. కావాలంటే నీకు కన్సల్టేషన్ ఫీజు ఇప్పిస్తాను."

"ఊరికే అన్నానండీ బాబూ! మనమధ్య ఫీజులేమిటి? మీజీతం నాది కాదా? మీకు క్రెడిట్ వస్తే నాకు వచ్చినట్టుకాదా? కాస్త టైమివ్వండి ఏదో ఒకటి ఆలోచిస్తాను. ఇక కంపెనీ విషయాలు చాలుగానీ నేను వంట మొదలుపెట్టాలి. పిల్లలు ట్యూషన్ నుండి వచ్చే వేళయింది."

కిచెన్‌లోకి నడిచింది హరిత.

ఎం.బి.ఏ. చేసిన కొన్నాళ్లు ఉద్యోగం చేసింది. ఉద్యోగంలో భర్త కొత్త ఎత్తుల కెదగడం, తాము ఆర్థికంగా నిలద్రొక్కుకోవడం, పిల్లల ఆలనపాలనకు సమయం చిక్కకపోవడం. ఈ కారణాల వల్ల ఉద్యోగానికి రాజీనామా చేసింది. వీలును బట్టి కొన్ని స్వచ్ఛంద సంస్థలకు సలహాసహకారాలను అందిస్తుంది. కాని ఆమె ఫస్ట్ ప్రిఫరెన్స్ కుటుంబమే.


మర్నాడు భర్త ఆఫీసు నుంచి రాగానే, కాఫీటిఫిన్లు కానిచ్చి, తన ప్లాను రూపురేఖలు రాసిన పత్రం ఇచ్చింది హరిత.

'నేడు అడ్వర్టైజింగ్ రంగంలో కోట్ల టర్నోవర్ ఉంది. అయితే అది విదేశీ మల్టీ నేషనల్ కంపెనీల గుప్పెట్లో ఉంది. విదేశీ కంపెనీలు, తమ ఉత్పత్తులతో బాటు అనుబంధంగా ప్రచార కంపెనీలు కూడా తీసుకొచ్చాయి. అవి మొదలు స్వదేశీ కంపెనీలతో పొత్తు కలవడం, ఇక్కడి వ్యాపారం, మార్కెట్‌లోని మెళకువలు అవగాహన రాగానే స్వదేశీ కంపెనీ నుండి వేర్లై సొంతషాపు పెట్టుకోవడం. గ్లోబలైజేషన్, లిబరలైజేషన్ పుణ్యమా అని మన దేశసంస్థలు మూతపడే పరిస్థితులు నెలకొన్నాయి. పెద్దపెద్ద యాడ్ ఏజెన్సీలు కూడా ఏదో ఒక విదేశీ ప్రచార సంస్థతో అనుబంధం పెట్టుకోకపోతే నిలద్రొక్కుకోలేని దుస్థితి! ఫైవ్‌స్టార్ కల్చర్ వల్ల అట్టహాసం, ఆర్భాటం తప్పదు. దానితో, నింగి కెగసిన అడ్వర్టైజింగ్ రేట్లు! ఉత్పత్తి విలువకు మించి, దాని మార్కెటింగ్ ఖర్చు! ఇందులో నష్టపోయేది మనదేశ కస్టమర్లు. లాభం పొందేది విదేశీ కంపెనీలు, ప్రచారసంస్థలు."

"నీ స్టడీ అద్భుతం హరితా! కాని ఇదేదో వ్యాసంలా ఉంది. నా సమస్యకు పరిష్కారమేదీ?"

"అంత ఆత్రం కూడదు శ్రీవారూ! పూర్తిగా చదవండి. ఆ తర్వాత మాట్లాడుకుందాం."

శైలేష్ చదవడం కొనసాగించాడు.




అడ్వర్టైజ్‌మెంట్ బడ్జెట్‌కై కోట్లు వెచ్చించి, విదేశీ కంపెనీలను, ఫైవ్‌స్టార్ హోటల్స్‌ని, ఆ సంస్కృతిని పోషించడం కంటే మన మ్యాన్ పవర్‌ని నిర్మాణాత్మకంగా ఉపయోగించుకోవాలి. అనాథ బాలబాలికలకు ఓ కొత్త జీవితం ప్రసాదించాలి. వారికి కనీస అవసరాలైన కూడు, గూడు, గుడ్డ మరియు విద్యలు కల్పించి, వారి శ్రమశక్తిని ప్రచారరంగానికి వాడుకోవాలి. ఈ పథకానికి అయ్యే మూలధనం కంపెనీ సమకూరిస్తే, పిల్లల శ్రమకు తగ్గ వేతనాల ద్వారా సంస్థ దినదిన నిర్వహణ ఖర్చులు భరించాలి. వారి చదువుకు, ఆట పాటలకు భంగం రాకుండా సెలవుల్లో గాని, ఆదివారాల్లోగాని పిల్లలను ప్రచారానికి వాడుకోవాలి. వారికి బాధ కలగకుండా తగిన వసతులు ఏర్పరచాలి. కూచోడానికి కుర్చీ, ఎండ తగలకుండా గొడుగు, మంచి యూనిఫాం సమకూర్చాలి.

ఇదీ స్థూలంగా హరిత పథకం.

శైలేష్ తన భార్య నైపుణ్యానికి అబ్బురపడ్డాడు. ఓ చదువుకున్న గృహిణి, ఉద్యోగం చేయకపోయినా తన తెలివిని ఎంత బాగా ఉపయోగించుకోవచ్చో నిరూపిస్తుంది హరిత ప్లాన్. అటు సమాజసేవ, ఇటు వాణిజ్యం! రెండింటిని ఎంత బాగా సమన్వయ పరిచింది. చిత్తశుద్ధితో అమలుపరిస్తే, ఈ ప్రణాళిక ప్రయోజనం అంతా ఇంతా కాదు. అన్ని ముఖ్యపట్టణాల్లో ఇది ప్రవేశపెట్టవచ్చు. కేవలం శారీరకశ్రమనే కాక పిల్లల సృజనాత్మకతను కూడా ప్రచార రంగానికి వాడుకోవచ్చు. కాపీరైటింగ్, ఆర్ట్‌వర్క్ విభాగాల్లో కూడా వారి నైపుణ్యాన్ని వాడుకోవచ్చు.

హరిత ప్లానుకు కొన్ని మెరుగులు దిద్ది, కంపెనీ మానేజ్‌మెంట్‌కు సమర్పించాడు శైలేశ్. ఈ ప్లాను అమలుపరచడం వల్ల కంపెనీకి ఖర్చు తగ్గడమే కాక, ఆదాయపన్ను రాయితీకూడా వచ్చే అవకాశాలు ఉండడంవల్ల యాజమాన్యం సానుకూలంగా స్పందించింది. ఈ విషయంలో అధ్యయనానికి డైరక్టర్ల కమిటీ ఏర్పరచారు. దానికి శైలేశ్ సెక్రటరీ అయితే, హరిత స్పెషల్‌ఇన్‌వైటీ. రెండునెలల్లో ప్రణాళిక ఫైనలైజయింది.

"వండర్ కిడ్స్ ఫౌండేషన్" పేర ట్రస్టు రిజిస్టరైంది. ట్రస్టు తన కార్యకలాపాలను, మొదట బెంగుళూరు, హైదరాబాద్, ముంబయిలలో ప్రారంభిస్తుంది. ఆ తర్వాత వీలును బట్టి ఇతర పట్టణాలకు విస్తరిస్తుంది.

000

నవంబర్ 14, బాలల దినోత్సవం!

'వండర్ కిడ్స్ ఫౌండేషన్' ప్రారంభోత్సవం!

స్థానిక అనాథశరణాలయంలోని బాలబాలికలతో, కంపెనీ సిబ్బంది కుటుంబసభ్యులతో 'రవీంద్ర సౌధ' కిటకిటలాడుతోంది. ముఖ్యమైన అతిథులంతా వచ్చారు. ఇక సమాజ కల్యాణం మంత్రివర్యులు విచ్చేయడమే తరువాయి. కంపెనీ యం.డి., శైలేశ్, ఇతర అధికారులు మంత్రిగారి స్వాగతానికి సిద్ధంగా ఉన్నారు. కాస్త ఆలస్యమైతేనేం, మంత్రిగారు వచ్చారు. సభ మొదలయింది.

ప్రార్థన, దీప ప్రజ్వలన తర్వాత కంపెనీ యం.డి.గారు తన ఉపన్యాసం ప్రారంభించారు. అతిథులకు స్వాగతం పలికి ఫౌండేషన్ నేపథ్యం, కార్యరూపం గురించి ఇలా వివరించాడు.

"మా కంపెనీ ధ్యేయం లాభాలే అయినా, సామాజిక స్పృహ కూడా ఉంది. మా కొత్త ఉత్పత్తి ప్రవేశాపెట్టేటప్పుడు ప్రచారంలో వినూత్నతను ఎన్నుకున్నాం. ఆ తర్వాత ఆ విషయానికి సంబంధించిన అంతర్మథనమే ఈ విశాల ఉదాత్త పథకానికి నాందీ పలికింది. ఈ పనికి పునాది మా వి.పి.శైలేశ్ వేస్తే, ఆ భవనానికి రూపురేఖలు వారి శ్రీమతి హరితగారు గీశారు. భర్త ఆలోచనకు ఆచరణయోగ్య పథకం రూపొందించి, హరితగారు తాను నిజమైన అర్ధాంగినని నిరూపించారు.

ప్రేక్షకుల నుండి చప్పట్లు.

ఉన్నత పదవుల్లోని ఎగ్జిక్యూటివ్స్ కూడా చేయలేని పని ఒక గృహిణి చేసింది. పిల్లల బాగోగులపట్ల తల్లికే ఎక్కువ ఆసక్తి ఉంటుందనడానికి ఇదొక్క చక్కని ఉదాహరణ. అయితే ఇక్కడి పిల్లలకు తల్లిదండ్రులు లేరు. ఆ అండను 'వండర్ కిడ్స్ ఫౌండేషన్' ఏర్పరుస్తుంది."

మళ్లీ చప్పట్లు.

"అనాథ బాలబాలికలకు మంచి జీవితాన్ని ప్రసాదించడానికి మావంతు సేవ చేయదలచుకున్నాం. ఓ వైపు అనాథలకు ఆశ్రయం కల్పించి, వారి విద్యాబాధ్యతలను స్వీకరించి, మరోవైపు వారి శ్రమశక్తిని వారి బాగోగుల కొరకే వాడుకోవడం, వారి స్వశక్తితోనే వారి ప్రగతికి సోపానం వేయడం ఈ ట్రస్టు లక్ష్యం. మా కంపెనీ లీగల్ ఆఫీసర్లతో, ప్రభుత్వ అధికారులతో కూలంకషంగా చర్చించి ట్రస్టు కార్యపరిధిని నిర్ణయించడం జరిగింది. ఈ విషయంలో మాననీయ సమాజ కల్యాణ మంత్రిగారి సహకారానికి ధన్యవాద లర్పిస్తున్నాను."

చప్పట్లు.

"ఈ ట్రస్టు సేవలు వేరే కంపెనీలకు కూడా అందుబాటులో ఉంటాయి. మా సంస్థకూడా ట్రస్టు సేవలు వినియోగించుకున్నప్పుడు వాటికి తగిన మూల్యం చెల్లిస్తుంది. ఈ స్వచ్ఛంద సంస్థకు ఇచ్చే విరాళాలు ఆదాయపు పన్ను రాయితీ పొందుతాయి. ఈ విధంగా ప్రచారఖర్చుకు ఓ సామాజిక ఉద్దేశ్యం ఆపాదించబడింది. ట్రస్టు విద్యాలయ భవనాలు, హాస్టల్సు కట్టే పని వచ్చే నెలలో మొదలై, ఆరునెలల్లో పూర్తవుతాయి. బాలబాలికల ఎన్నిక తర్వాత, వచ్చే ఎకడమిక్ ఇయర్ ప్రారంభంలో ట్రస్టు కార్యకలాపాలు మొదలౌతాయి.

ఈ సంస్థ నిర్వహణకు శ్రీమతి హరితను ఎగ్జిక్యూటివ్ ఛైర్‌పర్సన్‌గా నియమిస్తున్నాం" చప్పట్లు మిన్ను ముట్టాయి. రెండు నిమిషాలు హాలంతా కోలాహలం. అందరి కళ్లూ హరితపైనే. యం.డి.కొనసాగించాడు.

"శ్రీమతి హరితగారి మానసపుత్రికను వారే బాగా సంరక్షించగలరనే ఉద్దేశ్యంతో మాబోర్డ్ ఆఫ్ డైరక్టర్స్ ఈ నిర్ణయం తీసుకున్నారు." చప్పట్లు మ్రోగుతూనే ఉన్నాయి.

ప్రేక్షకుల్లో, ముందు వరుసలో కూర్చున్న హరితకు ఆశ్చర్యం, ఆనందం. కళ్లలో నీళ్లు. నిజమేనా ఇది అనే భావన! అంత పెద్ద బాధ్యత తనకు వద్దని భర్తతో అభ్యర్థన.

"శ్రీమతి హరిత తన గృహకృత్యాలు త్యాగం చేయవలసిన పనిలేదు. వారు సూపర్‌వైజ్ చేసి, సలహా సహకారాలు అందిస్తే చాలు, ట్రస్టు కార్యకలాపాలకు అవసరమయ్యే సిబ్బందిని కంపెనీ నియమిస్తుంది. అందుకని శ్రీమతి హరితగారు స్టేజిపైకొచ్చి తమ అంగీకారం తెలపాలని ప్రార్థన."

తడబడే అడుగులతో హరిత స్టేజి పైకి వచ్చింది. మంత్రిగారి చేతులమీదుగా ఆమెకు పుష్పగుచ్ఛం ఇవ్వబడింది.

అతిథులకు, సభకు అభివాదం చేసి హరిత తన ఉపన్యాసం మొదలుపెట్టింది. ఇప్పుడు ఆమె కాళ్లు వణకడం లేదు.

"ఉబుసుపోకకు మొదలైన మా భార్యాభర్తల సంభాషణ ఇంత విశ్వరూపం దాల్చడం నేను నమ్మలేకున్నాను. ఇందుకు కంపెనీ యాజమాన్యాన్ని అభినందిస్తున్నాను. సమాజం నుండి దండుకోవడం తప్ప, సమాజానికి తిరిగి ఇచ్చే నైజం లేని ఈ రోజుల్లో, ఈ కంపెనీ తన భిన్నత్వాన్ని చాటుకుంది. చిత్తశుద్ధిని కనబర్చింది. ఇంత పెద్ద బాధ్యతను నాకు అప్పగించినందుకు కంపెనీకి కృతజ్ఞులు. నాపై ఉంచిన వారి నమ్మ కాన్ని వమ్ము చేయనని సభాముఖంగా హామీ ఇస్తున్నాను. నా శాయశక్తులా ట్రస్టు కార్యకలపాల విజయానికి పాటుపడతాను. ఈ గౌరవం ఇచ్చిన యాజమాన్యానికి మరోసారి కృతజ్ఞతలు తెలుపుతూ సెలవు తీసుకుంటున్నాను." ఈ సారి చప్పట్ల పరంపరను శైలేశ్ మొదలుపెట్టాడు. అతనికి చాలా సంతోషంగా ఉంది.

తన భార్యపై గర్వం! వారిద్దరి కళ్లలో వింతతేజం! ఏదో సాధించామన్న తృప్తి.

000

కొన్ని నెలల తర్వాత కంపెనీ మరో ప్రాడక్టు లాంచింగ్. ఈసారి హైదరాబాద్‌లో ఏర్‌పోర్ట్‌నుండి రవీంద్రభారతికి వెళ్లే దారిలో ప్రతి యాభై గజాలకో బ్యానర్! దానిని పట్టుకుని మడత కుర్చీలపై కూర్చున్న పసికూనలు. కంపెనీ పేరున్న రంగు రంగుల టీ షర్ట్సు. తలపై ఇంద్ర ధనస్సులా పెద్ద గొడుగు. దానిపై కొత్త ప్రాడక్టు వివరాలు! పిల్లల ముఖాల్లో అలసట లేదు. ఏదో చేస్తున్నామన్న భావన. కళ్లలో ఓ కొత్త కాంతి! ట్యాంక్‌బండ్ మీదుగా కార్లో పోతున్న శైలేశ్‌కు హుస్సేన్‌సాగర్ నుండి వీచే పవనాలతో, ఆహ్లాదకరమైన వీణానాదం వినబడింది. ■

